మోటకొండూరులో జలశక్తి అభియాన్ కేంద్ర బృందం పర్యటన

మోటకొండూర్‌లో మిషన్ భగీరథ నీటిని పరిశీలిస్తున్న జలశక్తి అభియాన్ బృందం సభ్యులు

మోటకొండూరు, ఆగస్టు 23 : జలశక్తి అభియాన్ కేంద్ర బృందం సభ్యులు శుక్రవారం మండల కేంద్రంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ మిషన్ భగీరథ నీటి సరఫరాపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ నల్లాల ద్వారా వస్తున్న నీటిని సేకరించి రెసిడియల్ క్లోరిన్ టెస్ట్ చేశారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో మిషన్ భగీరథ సిబ్బందితో మాట్లాడి రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో కేంద్ర భూగర్భ జల శాఖ శాస్త్రవేత్త ఉపేంద్ర, ఎంపీడీఓ ఇందిర, ఈఈ కర్ణకరన్, ఏఈ సుప్రియ, ఎంపీఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో జిల్లా అధికారి ఆకస్మిక తనిఖీ

మాసుకుంట అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలతో కలిసి భోజనం చేస్తున్న జిల్లా పౌరసరఫరాల అధికారి వనజారెడ్డి

భువనగిరి కలెక్టరేట్, ఆగస్టు 23 : అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు అందుతున్న పౌష్టికాహారాన్ని, నిర్వహణను జిల్లా పౌరసరఫరాల అధికారి వనజారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణంలోని మాసుకుంట అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న సన్న బియ్యం పక్కదారి పట్టకుండా సక్రమంగా వ్యవహరించాలన్నారు. పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఆమె వెంట సివిల్ సప్లయ్ డీటీ గులాం ఇద్రీస్ ఉన్నారు.

ఓటరు జాబితా నిర్వహణలో బీఎల్ఓల పాత్ర కీలకం

బీఎల్ఓల సమావేశంలో మాట్లాడుతున్న తాసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి

ఆలేరు రూరల్, ఆగస్టు 23 : ఓటరు జాబితా నిర్వహణలో బీఎల్ఓల పాత్ర కీలకమైందని తాసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తాసీల్దార్ కార్యాలయంలో స్పెషల్ సమ్మరి రివిజన్ – 2025లో భాగంగా బూత్ లెవల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లకు శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వేచ్ఛ, నిష్పక్షపాత ఎన్నికల కోసం తప్పులేని ఓటర్ల జాబితా చాలా ముఖ్యమన్నారు. మహిళలు, యువకులు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు అన్ని వర్గాలకు చెందిన అర్హులైన పౌరులను ఓటర్లుగా చేర్చాలని సూచించారు. 18సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ అక్టోబర్ 1లోపు ఓటు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్నికల శిక్షణ అధికారులు దూడల వెంకటేశ్, బద్దం సంజీవరెడ్డి, ఎం.తిరుపతి రెడ్డి, బీఎల్ఓలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం : ఎంపీడీఓ

వడాయిగూడెంలో పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు

భువనగిరి కలెక్టరేట్, ఆగస్టు 23 : పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాస్‌రావు అన్నారు. శుక్రవారం ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని పురస్కరించుకుని మండలంలోని వడాయిగూడెం గ్రామంలో ఇంటింటికీ తిరిగి నీటి నిల్వలు, దోమల పెరుగుదల తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమల వ్యాప్తికి కారణమయ్యే పిచ్చి మొక్కలను తొలగించాలని సూచించారు. వారంలో ఒక్క రోజు శుక్రవారం తప్పకుండా ఇంటి ఆవరణలో దోమల ఆవాసాలైన నీటి నిల్వలను తొలగించి డ్రై డే పాటించాలన్నారు. రోగకారక దోమల వ్యాప్తిని నిరోధించేందుకు ఎప్పటికప్పుడు బ్లీచింగ్ పౌడర్, ఫినాయిల్ వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ మొరిగాడి దినకర్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి ఆమని, ఆరోగ్య, సిబ్బంది, ఆశ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే సేవాదృక్పథం అలవర్చుకోవాలి : సీఐ

సమావేశంలో మాట్లాడుతున్న సీఐ అశోక్‌రెడ్డి

చౌటుప్పల్, ఆగస్టు 23 : విద్యార్థి దశలోనే ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం అలవర్చుకోవాలని సీఐ అశోక్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని చందన స్కూల్ యజమాన్యం, విద్యార్థులు కలిసి కేరళలోని వయనాడ్ బాధితులకు రూ.17వేల విరాళాలు సేకరించారు. ఆ డబ్బును శుక్రవారం సంబంధిత రిలీఫ్ ఫండ్‌కు సీఐ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి సహాయం చేయడం అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో ఇలాంటి కార్యక్రమాలు మరింత చేయాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అవ్వారు రామేశ్వరి, డైరెక్టర్ అవ్వారు గోవర్ధన్, ఉపాధ్యాయులు కె.స్వప్న, పద్మ, గీత, రేణుక, స్వప్న, జగదీశ్వరి, అర్చన, కవిత, శ్రీలత, రమ, దీప, లావణ్య పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత : ఎస్ఐ

భీమనపల్లిలో డ్రగ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ భాస్కర్‌రెడ్డి

భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 23 : మాదక ద్రవ్యాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎస్ఐ భాస్కర్‌రెడ్డి అన్నారు. మండలంలోని భీమనపల్లి గ్రామంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్, గంజాయి వినియోగం – అనర్థాలపై ప్రజలకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్‌ను వినియోగించి యువత బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు.

కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

మార్కండేయ స్వామి ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

బీబీనగర్, ఆగస్టు 23 : మండల కేంద్రంలోని బ్రాహ్మణపల్లి రోడ్డులో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మార్కండేయస్వామి ఆలయ నిర్మాణం చేపడుతున్నారు. ఆలయానికి బీబీనగర్ మాజీ ఎంపీటీసీ గోలి నరేందర్‌రెడ్డి లక్ష రూపాయల చెక్కును విరాళంగా ఆలయ కమిటీ సభ్యులకు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శివయ్య, ఆకుల సత్తయ్య, సామల ప్రభాకర్, వీరేశం, శంకర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా సుదర్శన నారసింహ హోమం

ఊంజల్ సేవలో భాగంగా అమ్మవారిని ఊరేగిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, ఆగస్టు 23 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో సుదర్శన నారసింహ హోమం శాస్త్రోక్తంగా జరిగింది. శుక్రవారం ప్రధానాలయం వెలుపలి ప్రాకార మండపంలోని కల్యాణ మండపంలో సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ హవనం జరిపారు. భూతపేత పిశాచాల బాధలు తొలగి, ఇలలోక సుఖాలు, పరలోక మోక్షాలు సిద్ధించే హోమంలో భక్తులు పాల్గొన్నారు. స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా ముస్తాబు చేసి గజ వాహనంపై వేంచేపు చేసి వెలుపలి ప్రాకార మండపంలో ఊరేగించారు. స్వామి, అమ్మవార్లకు నిత్య తిరు కల్యాణోత్సవం అత్యంత వైభవంగా సాగింది. లక్ష్మీసమేతుడైన నారసింహస్వామిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా నిత్య తిరుకల్యాణ తంతును జరిపారు. కల్యాణమూర్తులను ముస్తాబు చేసి భక్తులకు అభిముఖంగా అధిష్ఠించి కల్యాణ తంతును నిర్వహించారు. భక్తులు పాల్గొని కల్యాణాన్ని వీక్షించి తరించారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయ ముఖ మండపంలో స్వామివారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా భక్తులతో సువర్ణ పుష్పార్చన జరిపించారు. బంగారు పుష్పాలతో దేవేరులకు అర్చన చేశారు. సాయంత్రం స్వామివారికి తిరువీధి సేవ, దర్బార్ సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. ఆండాళ్ అమ్మవారికి ఊంజల్‌సేవను నిర్వహించారు. సాయంత్రం ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారిని పట్టువస్త్రాలు, బంగారు, ముత్యాలు, వజ్రాభరణాలతో దివ్య మనోహరంగా అలంకరించిన అర్చకులు ఊంజల్ సేవలో తీర్చిదిద్ది ఊరేగించారు. ఆస్థాన విద్వాంసుల మంగళ వాయిద్యాలు, మహిళా భక్తుల మంగళ నీరాజనాల నడుమ ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. అనుబంధ పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో నిత్య పూజలు స్మార్తగమశాస్త్రరీతిలో జరిగాయి. సుమారు 9వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.14,71,500 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు. కొండపైన సాంస్కృతిక మండపంలో ధార్మిక సాహిత్య సంగీత సభలో భాగంగా భువనగిరికి చెందిన రమేశ్ డ్యాన్స్ అకాడమీ కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించింది.

గుట్ట ఏడీఏగా శాంతినిర్మల

యాదగిరిగుట్ట, ఆగస్టు 23 : వ్యవసాయ సహాయ సంచాలకులుగా శాంతినిర్మల నియమితులయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇప్పటి వరకు ఏడీఏగా పనిచేసిన డి.పద్మావతి ఆలేరుకు బదిలీ అయ్యారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని మట్టి నమూనా పరీక్ష కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న శాంతినిర్మల ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఆమె రెండ్రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఆలేరు ఏఓగా శ్రీనివాస్ బాధ్యతలు

బాధ్యతలు స్వీకరిస్తున్న ఏఓ శ్రీనివాస్

ఆలేరు రూరల్ : మండల వ్యవసాయ అధికారిగా శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మునుగోడు ఏఓగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ ఆలేరుకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణమాఫీ కానివారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఏడీఏ కార్యాలయంలో ఏఈఓలను సంప్రదించాలని సూచించారు. వ్యవసాయంపై రైతులకు ఎలాంటి సందేహాలున్నా తమరిని సంప్రదించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి

వెంకటనర్సింహారెడ్డి (ఫైల్)

యాదగిరిగుట్ట, ఆగస్టు 23 : రోడ్డు ప్రమాదంలో ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతిచెందారు. యాదగిరిగుట్ట మండలం మాసాయిపేట గ్రామానికి చెందిన బత్తి వెంకటనరసింహారెడ్డి బొమ్మలరామారం మండలం తిరుమలాపురం ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. తన కుమారుడికి మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్ ఐఐటీలో సీటు రావడంతో కళాశాలలో చేర్పించేందుకు వెళ్లారు. గురువారం రాత్రి తిరుగు ప్రయాణంలో భోపాల్ ప్రాంతంలో ట్రావెల్ బస్సు బోల్తా పడడంతో మృతిచెందారు.

'ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి'

భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 23 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ ఉద్యమకారులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఐక్యవేదిక మలిదశ కమిటీ ఉపాధ్యక్షుడు, తెలంగాణ ఉద్యమకారుడు పొనమోని శ్రీశైలంముదిరాజ్ డిమాండ్ చేశారు. పట్టణంలో శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ఉద్యమకారులకు 250 గజాల చొప్పున ఇంటి స్థలాన్ని అందిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, ఆ హామీని వెంటనే నెరవేర్చాలని కోరారు.

ఎస్ఐ కృష్ణయ్యకు సన్మానం

ఆత్మకూరు(ఎం) : ఎస్ఐ కృష్ణయ్యను ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి, శాంతిభద్రతలకు భంగం కలుగకుండా అన్ని సంఘాలు సహకరించాలన్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కూరెళ్ల రమేశ్, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొంపల్లి వెంకటేశ్, నాయకులు గణేశ్, అనిల్, నవీన్, శ్రీధర్, రాజు పాల్గొన్నారు.

మునిపంపుల - లక్ష్మాపురం రోడ్డును బీటీగా మార్చాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్

దీక్ష చేస్తున్న సీపీఎం నాయకులు

రామన్నపేట, ఆగస్టు 23 : మునిపంపుల – లక్ష్మాపురం రోడ్డును బీటీగా నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ అన్నారు. మునిపంపుల నుంచి లక్ష్మాపురం గ్రామం వరకు బీటీ రోడ్డు ఏర్పాటు చేయాలని కోరుతూ మండలంలోని మునిపంపుల గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. దీక్షా శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గుంతలమయంగా మారి అస్తవ్యస్తంగా ఉండి కనీసం నడవలేని స్థితిలో ఉన్న మట్టి రోడ్డు వల్ల ప్రజలు నరకయాతన పడుతున్నారన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని, సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జెల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, నాయకులు కల్లూరి నగేశ్, ఆండాలు, శ్రీనివాస్, జితేందర్, చంద్రశేఖర్, శివకుమార్, భిక్షం, ఉమాపతి పాల్గొన్నారు.

భువనగిరిలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి : ఎస్ఎఫ్ఐ

సైకిల్ యాత్ర చేపట్టిన ఎస్ఎఫ్ఐ నాయకులు

భువనగిరి అర్బన్, ఆగస్టు 23 : భువనగిరి పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ ఎల్ మూర్తి డిమాండ్ చేశారు. డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన సైకిల్ యాత్రను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కొట్లాడి తెచ్చుకున్న స్వరాష్ట్రంలో విద్య సంక్షోభంలో పడిందన్నారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగంపై దృష్టి పెట్టకుండా కాలయాపన చేస్తుందని విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న రూ.8వేల కోట్ల స్కాలర్‌షిప్‌ను వెంటనే విడుదల చేయాలన్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, మండలానికి ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయాలని, గురుకులాల్లో సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సైకిల్ యాత్ర ఈ నెల 28వరకు కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కల్లూరి మల్లేశం, నాయకులు లావుడియా రాజు, శివాని నాగరాజు, రాహుల్, శ్రీనివాస్, నరేందర్, ఉదయ్ పాల్గొన్నారు.

హైస్కూల్‌లో దాతల సహకారంతో రేకుల షెడ్ నిర్మాణం

కొరటికల్ ఉన్నత పాఠశాలలో నిర్మించిన భోజనశాల రేకుల షెడ్

ఆత్మకూరు(ఎం), ఆగస్టు 23 : మండలంలోని కొరటికల్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన వంటశాల కోసం గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు భిక్షం తన తండ్రి పెద్ది సత్తయ్య జ్ఞాపకార్థం రూ.16వేలతో రేకుల షెడ్ నిర్మాణం చేపట్టారు. దాతకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.వెంకన్న, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ సత్యలక్ష్మి, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

ట్రినిటీలో జాతీయ అంతరిక్ష దినోత్సవ వేడుకలు

ట్రినిటీలో చంద్రయాన్–3 నమూనా ప్రయోగ ప్రదర్శన

చౌటుప్పల్, ఆగస్టు 23 : పట్టణంలోని ట్రినిటీ పాఠశాలలో జాతీయ అంతరిక్ష దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు చంద్రయాన్–3 నమూన ప్రయోగ ప్రదర్శనను నిర్వహించారు. చంద్రుడిపై విజయవంతంగా దక్షిణ ధ్రువం వైపు ల్యాండింగ్ అయిన విధానాన్ని ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ కేవీబీ కృష్ణారావు, ప్రిన్సిపాల్ ఉజ్జిని మంజుల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రబలుతున్న జ్వరాలు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యం కోసం వేచి ఉన్న రోగులు

భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 23 : మున్సిపాలిటీ పరిధిలో విష జ్వరాలు ప్రబలుతున్నాయి. ఒక్కో వార్డులో పదుల సంఖ్యలో జ్వర బాధితులున్నారు. రోగులతో ఆస్పత్రులు నిండిపోతున్నాయి. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోజూ వందమంది ఓపీ చూస్తుండగా.. అందులో 70కి పైగా జ్వర పీడితులే ఉంటున్నారు. జ్వరాల తీవ్రత పెరిగి కాళ్లు, ఒంటి నొప్పులతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. కొందరికి ప్లేట్‌లెట్లు తగ్గుతున్నాయి. రక్త, ఇతర పరీక్షలు చేయించుకుంటే డెంగీ వచ్చినట్లు నిర్ధారణ అవుతుంది. పారిశుధ్య లోపం, ఇండ్ల పరిసరాల్లో గడ్డి, పిచ్చి మొక్కలు పెరుగడం, డ్రైనేజీల్లో మురుగు పేరుకుపోవడంతో దోమలు పెరిగిపోతున్నాయి. దీంతో జ్వరాలు వస్తున్నాయి. వార్డుల్లో దోమల నివారణకు మున్సిపల్ సిబ్బంది ఫాగింగ్ చేయాల్సి ఉండగా.. పట్టించుకోవడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. జ్వర బాధితులు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తే అనేక టెస్టులు రాస్తున్నారు. అయితే.. వైరల్ ఫీవర్స్ ఉన్న నేపథ్యంలో సాధారణ జ్వరమే అని నిర్లక్ష్యం చేయకుండా వైద్యం చేయించుకుంటే మంచిదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. దోమల నివారణకు వార్డుల్లో ఫాగింగ్ చేసేలా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఆడబిడ్డ పెండ్లికి ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఆర్థిక సాయం

పెండ్లి కుమార్తెకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

సంస్థాన్ నారాయణపురం, ఆగస్టు 23 : మండలంలోని జనగాం గ్రామానికి చెందిన అనమోని లింగస్వామి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. లింగస్వామి కూతురు వివాహం చౌటుప్పల్‌లోని జయశ్రీ గార్డెన్‌లో శుక్రవారం జరిగింది. వారిది నిరుపేద కుటుంబం కావడంతో విషయం తెలుసుకున్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆమె వివాహానికి హాజరై రూ.50వేల ఆర్థిక సాయం అందజేశారు. భవిష్యత్తులో కూడా యువతి కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

కనకేశ్ కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే సునీత పరామర్శ

కనకేశ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత

రాజాపేట, ఆగస్టు 23 : బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సట్టు తిరుమలేశ్ సోదరుడు కనకేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి మృతుడి కుటుంబాన్ని పరామర్శించి, అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఆమె వెంట బీఆర్ఎస్ సెక్రెటరీ జనరల్ సందిల భాస్కర్‌గౌడ్, మహేంద్ర యువసేన మండలాధ్యక్షుడు బిల్లకుదురు రాజు, బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు ఎర్రగోకుల జశ్వంత్ ఉన్నారు.

బీఆర్ఎస్‌లో పదవులు అనుభవించినప్పుడు త్యాగాలు గుర్తుకు రాలేదా?

- ఎమ్మెల్యే మందుల సామేల్‌కు బీఆర్ఎస్ నేత యాకూబ్‌రెడ్డి చురక

మోత్కూరు, ఆగస్టు 23 : తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ బీఆర్ఎస్‌లో ఉండి రెండు పర్యాయాలు గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా బోగాలు అనుభవించినప్పుడు త్యాగాలు గుర్తుకు రాలేదా? అని మోత్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొణతం యాకూబ్‌రెడ్డి ప్రశ్నించారు. మండల కేంద్రంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ నేత కేసీఆర్ ఆశీస్సులతో బీఆర్ఎస్‌లో అనేక పదవులను అనుభవించి గుర్తింపు పొందడంతోనే ఇప్పుడు ఎమ్మెల్యే స్థాయిలో ఉన్నామనే విషయాన్ని మర్చిపోవద్దన్నారు. గిడ్డంగుల సంస్థ చైర్మన్ పదవిని అనుభవించి, గత ఎన్నికల్లో ఎమ్మెల్యే టిక్కెట్ రాకపోవడంతోనే కాంగ్రెస్‌లో చేరిన విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. బీఆర్ఎస్ పాలనలో రెండు సార్లు నామినేట్ పదవిని పొంది ఏనాడైనా నియోజకర్గంలో ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలకు హాజరయ్యావా? అని ప్రశ్నించారు. రాజకీయ బిక్ష పెట్టింది కేసీఆర్, బీఆర్ఎస్ అన్న విషయాన్ని మర్చిపోవద్దన్నారు. తిరుమలగిరిలో రైతుల పక్షాన శాంతియుతంగా ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలపై రాళ్లతో దాడి చేయడం తగదని హితవు పలికారు. రాజకీయ కక్షలకు, వివాదాలకు తెరలేపుతున్న కాంగ్రెస్‌కు, ఎమ్మెల్యే సామేల్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పొన్నెబోయిన రమేశ్, మాజీ ఎంపీటీసీ పానుగుళ్ల విష్ణుమూర్తిగౌడ్ పాల్గొన్నారు.

ఆప్టిమస్ కంపెనీపై చర్యలు తీసుకోవాలి : సీపీఎం

ఆప్టిమస్ కంపెనీ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

బొమ్మలరామారం, ఆగస్టు 23 : మండలంలోని రామలింగంపల్లి గ్రామంలోని ఆప్టిమస్ కంపెనీపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు దాసరి పాండు అన్నారు. కంపెనీ ఎదుట శుక్రవారం నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. కంపెనీ నుంచి వెలువడిన వ్యర్థ రసాయనాలు రంగాపూర్ చెరువులో కలిసి చేపలు మృతిచెందడంతో మత్స్య కార్మికులకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. భూగర్భజలాలు కలుషితమై ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని పేర్కొన్నారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. సీపీఎం మండల కార్యదర్శి ర్యాకల శ్రీశైలం, నాయకులు సత్యనారాయణ, నర్సింహ, పున్నమ్మ, మంగమ్మ, భారతమ్మ, నర్సమ్మ పాల్గొన్నారు.

సాయుధ పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించాలి : సీపీఐ

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

రాజాపేట, ఆగస్టు 23 : తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించాలని సీపీఐ మండల కార్యదర్శి చిగుళ్ల లింగం అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటయోధుడు ఆరుట్ల రామచంద్రారెడ్డి 39వ వర్ధంతి కరపత్రాలను శుక్రవారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 26న కొలనుపాకలో నిర్వహించే వర్ధంతిలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కరుణాకర్, సిద్దులు, రాములు, పోచయ్య, నర్సింహ పాల్గొన్నారు.

మొగిలిపాకలో వాటర్ క్యాన్ల పంపిణీ



వాటర్ క్యాన్లు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కిరణ్‌రెడ